క్లుప్తంగా

వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



క్షతగాత్రుడికి సపర్యలు చేస్తున్న స్థానికులు

టెక్కలి: జాతీయ రహదారిలో కోటబొమ్మాళి మండలం చలమయ్యపేట గ్రామం సమీపంలో మంగళవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుకు ఒక వైపు దూసుకుపోయింది. ఈ ఘటనలో ఒకరు గాయపడ్డారు. కోటబొమ్మాళి ప్రకాశ్‌నగర్ కాలనీకు చెందిన నర్సిపురం రమణ తన భార్య భవానీతో కలిసి టెక్కలి వైపు వస్తుండగా చలమయ్యపేట సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రమణ అపస్మారక స్థితికి చేరుకోవడంతో సమీపంలో ఉన్న కొంతమంది సీపీఆర్ చేయడంతో ప్రాణాపాయం తప్పింది. అనంతరం జాతీయ రహదారి పెట్రోలింగ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఒత్తిడిని జయించాలి

● డీఈవో తిరుమలచైతన్య



ప్రిన్సిపాల్ శోభారాణిని అభినందిస్తున్న డీఈవో తిరుమలచైతన్య

టెక్కలి: ఒత్తిడిని జయించి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.తిరుమలచైతన్య అన్నారు. టెక్కలి బాలికోన్నత పాఠశాలలోని ప్లస్-2 ఇంటర్ బాలికల కళాశాలను మంగళవారం సందర్శించారు. గత ఏడాది ఇంటర్ ప్రవేశాలు, ఫలితాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణిను అభినందించి సన్మానించారు. ఈయనతో పాటు ఉప విద్యా శాఖాధికారి పి.విలియమ్స్, ఉపాధ్యాయులు టి.ఆనందరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్తులు ఆక్రమిస్తే చర్యలు



అక్రమణ తొలగించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: ప్రభుత్వ ఆస్తులు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. షాపులు అధికంగా ఖాళీఉన్నా ఫుట్‌పాత్‌పైకి వచ్చి వ్యాపారాలు సాగిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మంగళవారం స్థానిక మూడు రోడ్లు కూడలి వద్ద తొలగించిన అక్రమణలు పరిశీలించి మరమ్మతులు చేయించారు. మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

సర్వీస్ రూల్స్ అమలు చేయాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కంచిలి: ఏపీ మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు కోరారు. మఠం సరియాపల్లి, ఇచ్ఛాపురం, కవిటి మోడల్ స్కూళ్లలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కారుణ్య నియామకాలను వెంటనే జరిపించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరీకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మోడల్ స్కూల్ టీచర్ ఫెడరేషన్ కో కన్వీనర్ బాలాజీ కోరారు. మండల ప్రధాన కార్యదర్శి నల్లాన రవి, కోశాధికారి త్రినాథ్, కవిటి మండల కౌన్సిలర్ సూర్యం పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం ప్రసాదరావు

ఇచ్ఛాపురం రూరల్: ప్రతిఒక్కరూ స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సెర్ప్ ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. జగన్నాథపురం గ్రామం వద్ద మండలంలోని మహిళాసంఘ సభ్యులకు స్వచ్ఛభారత్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. శతశాతం కిచెన్ గార్డెన్, హోం కంపోస్టుల గురించి వివరించారు. ఉపాధి హామీ పథకం ఏపీవో పి. శ్రీనివాసరావు, సీసీ మోహన్‌రావు, ఎఫ్ఏ నాగమ్మ, వీఏవోలు సుధ, లత, నీవేణి, దేవకీ పాల్గొన్నారు.

ఊగుతున్న వంతెనలు!

● జీటలు వారిన బ్రిటీష్ కాలం నాటి వంతెనలు
● పూర్తిగా శిథిలమైన రక్షణ గోడలు
● భయం భయంగా ప్రయాణం

వజ్రపుకొత్తూరు రూరల్: రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిన ఉద్దాన ప్రాంతంలో బ్రిటీష్ కాలంలో గెడ్డలు, కాలువలు, వాగులు, ఏరులపై నిర్మించిన వంతెనలు అనేకం ఉన్నాయి. అయితే ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఇవి కూలి పెద్ద అపాయం జరిగితే బాధ్యత ఏవరు వహిస్తారని ప్రజలు పాలకులను ప్రశ్నిస్తున్నారు. ఈ వంతనలపై వెళ్తుంటే ఊగుతుండడంతో ఎలాంటి ఆపద వస్తుందోనని జనం భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



శిథిలమైన బెండి గేట్ వంతెనపై నుంచే ప్రయాణిస్తున్న బస్



ప్రమాదకరంగా ఉన్న గోపాలపురం వంతెన



శిథిలావస్థలో ఉన్న రాకాసి గడ్డె వంతెన

శిథిలావస్థలో ఉన్న వంతెనలు..

- పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లోని పలు వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వాటిలో బెండి గేట్-సరియాపల్లి వంతెన ఒకటి. ఇది బీటలువారి పిచ్చి మొక్కలతో దర్శనం ఇస్తూ ప్రయాణికులకు భయం గొల్పుతుంది.
- మందస, వజ్రపుకొత్తూరు మండలాలను కలిపే ప్రధాన రహదారిలో ఒంకులూరు రాకసి గడ్డెపై ఉన్న వంతెన శిథిలమై ప్రమాదకరంగా ఉంది. రక్షణ గోడ పూర్తిగా శిథిలమైంది.
- కాశీబుగ్గ-బెండి గేట్ మధ్యలో గోపాలపురం గెడ్డ వద్ద ఉన్న మరో వంతెన శిథిలావస్థకి చేరి, పిచ్చిమొక్కలతో దర్శనం ఇస్తుంది.
- రిట్టపాడు-నర్సిపురం మధ్యలో ఉన్న వంతెన అభివృద్ధికి నోచుకోక ఇబ్బందికరంగా ఉంది.
- గల్లి-వజ్రపుకొత్తూరు మధ్యలో ఉప్పుటేరుపై ఉన్న వంతెన, పాతటెక్కలి వద్ద ఉన్న వంతెనలు కుడా భయాందోళనకు గురి చేస్తున్నాయి.
- పలాస మండలంలో బ్రహ్మణతర్లా-లక్ష్మీపురం మధ్యలో గెడ్డెపై ఉన్న వంతెన మరీ ప్రమాదకరంగా మారింది. కనీసం రక్షణ గోడ కూడా లేకపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.
- మందస మండలంలో మహేంద్రతనయ వంతెనలు సొండిపూడి, పొత్తంగి, రామక్రిష్ణపురం, బెల్లుపటియా వంతెనలు, మెళియపుట్టి ముకుందపురం వంతెన, పూడిలంక కాలిబాట సైతం అభివృద్ధికి నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రాకాసి గెడ్డ వంతెన నిర్మాణానికి గతంలో శంకుస్థాపన..

మందస, వజ్రపుకొత్తూరు మండలాలను కలిపే అతి ప్రధానమైన డెప్పూరు-బహడపల్లి రహదారిలో ఉన్న వంకులూరు రాకాసి గెడ్డ వంతెన నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చొరవతో సుమారు రూ. 5.65 కోట్లు నిధులు మంజూరు చేయడంతోపాటు శంకుస్థాపన చేసారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిర్మాణ పనులు జరగలేదు. ఆ తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు.

వంతెన నిర్మాణం ఏళ్లనాటి కల



వంకులూరు రాకాసి గెడ్డ వంతెన నిర్మాణం ఈ ప్రాంత ప్రజల ఏళ్ల నాటి కల. ఇది పూర్తయితే ఉద్దాన ప్రాంత ప్రజలకు చాలా మేలు కలుగుతుంది. ప్రస్తుతం ఉన్న వంతెనపూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీనిపై అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించాం. అయితే గత ప్రభుత్వ హయంలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

– జోగి అప్పారావు, ఒంకులూరు, వజ్రపుకొత్తూరు మండలం

ప్రయాణం భయంగా ఉంది



ఎప్పుడో నిర్మించిన వంతెనలు కూలిపోయే పరిస్థితికి చేరాయి. ఈ వంతెనల మీద ప్రయాణం చేయాలంటేనే భయం వేస్తుంది. పెద్ద వాహనాలు శిథిలమైన వంతెనలపై ప్రయాణం చేస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. అధికారులు స్పందించి వంతెనలను అభివృద్ధి చేయాలి.

– వై.షణ్ముఖరావు, ప్రయాణికుడు, వజ్రపుకొత్తూరు మండలం

ప్రతిపాదనలు పంపించాం

శిథిలావస్థలో ఉన్న వంతెనలను పరిశీలించి ఉన్నాతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే నిర్మాణాలు చేపడతాం. పాక్షికంగా దెబ్బతిన్న వంతెనలకు మరమ్మతులు చేపడతాం.

– విక్రమ్, ఆర్అండ్‌బీ జేఈ, పలాస మండలం

గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కంచిలి: గర్భకోశ వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు చికిత్సలు చేయించడం వలన ఆర్థికంగా నష్టపోకుండా ఉంటారని జిల్లా పశుగణాభివృద్ధి సహాయ సంచాలకులు డాక్టర్ సీహెచ్ సత్యప్రకాష్ అన్నారు. మండలంలోని మకరాంపురం పంచాయతీ పరిధి సాలినపుట్టుగ గ్రామంలో మండల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత గర్భకోశవ్యాధి చికిత్స శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గర్భకోశ వ్యాధిపై పాడిరైతులకు అవగాహన కల్పించారు. ఏడాదికో దూడ ఆవశ్యకతను వివరించారు. త్రిపుల్ ఎస్ సెమెన్ వలన 98 శాతం ఆడ దూడ పుట్టడం వలన పాడిరైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. పాడిరైతులకు గర్భకోశ నివారణ మందుల్ని పంపిణీ చేశారు. శిబిరంలో సహాయ సంచాలకులు డాక్టర్ కె.అప్పలస్వామి, మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ టి.శిరీష, సోంపేట పశువైద్యాధికారి డాక్టర్ జి.కిరణ్‌కుమార్, సిబ్బంది రాజేష్, అశోక్, విజయ్ పాల్గొన్నారు.



గర్భకోశ నివారణ మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కంచిలి: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐకేపీ సీసీ బి.పాపారావు అన్నారు. తలతంపర గ్రామంలో స్వయంశక్తి సంఘాల సభ్యులతో సెర్ప్ ప్రాజెక్టు ఆదేశాలతో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇందులో భాగంగా అంపురం, బిన్నళకొత్తూరు గ్రామాల్లో సీసీలు ప్రమీల, రాణిల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ఇందులో ఉపాధిహామీ సిబ్బంది సమన్వయంతో కిచెన్ గార్డెన్, హోం కంపోస్టు, ఈ శ్రమ్, సూర్యఘర్, ఫెడ్‌నెట్స్ కోసం వివరించారు. గ్రామసంఘాల అధ్యక్షులు, వీవోలు పాల్గొన్నారు.



తలతంపర సమావేశంలో మాట్లాడుతున్న పాపారావు

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట ఉత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురం గ్రామంలోని సీతారామ ఆలయం ప్రాంగణంలో ఉపాలయ దీపారాధ మండపంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీలు బోర పుష్ప, పైల దేవదాస్‌రెడ్డి పూజలు చేశారు. సర్పంచ్ కారింగి త్రినాథ్, వైఎస్సార్‌సీపీ నేతలు ఇప్పిలి కృష్ణారావు, ఆలయ ధర్మకర్తలు తిప్పన లక్ష్మీ దేవి పురుషోత్తం పాల్గొన్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సంజీవ్‌నగర్‌కు చెందిన లక్ష్మీనారాయణ పాత్రోను మూడు లీటర్ల నాటుసారాతో మంగళవారం అరెస్టు చేశామని పలాస ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లికార్జునరావు తెలిపారు. సారా విక్రయాలు, తయారీపై నిఘా పెట్టామన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కాశీబుగ్గ: మందస మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎల్.లక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదు నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు హెచ్‌టీటీపీ://ఏపీబీఆర్ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 97045 50012 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ ప్రారంభం

కంచిలి: అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కంచిలి ఎంపీడీవో వి.తిరుమలరావు అన్నారు. కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆరో రోజుల శిక్షణను మంగళవారం ప్రారంభించారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు సమగ్ర అభివృద్ధి కోసం 120 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి విడతగా ఆరు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకొన్న మెలకువలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఎంఈవోలు శివరాంప్రసాద్, కె.చిట్టిబాబులు సూచించారు. ఐసీడీఎస్ పీవో ఇందిర, సూపర్‌వైజర్లు జి.లక్ష్మి, జి.ఈశ్వరి, స్థానిక పాఠశాల హెచ్‌ఎం సీతారాంనాయుడు, మాస్టర్ ట్రైనర్లు వై.శంకరరావు, ఎస్.గోపి, ఐ.భాస్కరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆహ్లాదకరంగా విద్యాబోధన అందించాలని ఎంపీడీవో రామారావు, సీడీపీవో నాగరాణి అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీల కోసం ఏర్పాటుచేసిన జ్ఞానజ్యోతి శిక్షణలో ఆయన మాట్లాడారు. ఎంఈవోలు కె.అప్పారావు, విశ్వనాథం, పాఠశాల హెచ్‌ఎం పి.వి.రవణమ్మ పాల్గొన్నారు.



కంచిలి: మాట్లాడుతున్న ఎంపీడీవో తిరుమలరావు



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు

కవిటి: స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన చిన్నారులను అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు బాధ్యతగా అక్కున చేర్చుకోవాలని ఎంఈఓ ధనుంజయ మజ్జి అన్నారు. కవిటిలో నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు.

నందిగాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా సంసిద్ధులు చేయాలని కోర్సు కో-ఆర్డినేటర్, మండల విద్యాశాఖాధికారి జి నర్సింహులు అన్నారు. మండలకేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఐసీడీఎస్- విద్యాశాఖ అధ్వర్యంలో నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణలో పాల్గొన్నారు. ఎంఈఓ-2 జె.చిన్నారావు, ఐసీడీఎస్ ఏసీడీపీఓ ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్లు జలజాక్షి, శారదామణి పాల్గొన్నారు.

సోంపేట: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీలకు తొలివిడత శిక్షణ ప్రారంభమైంది. ఎంఈవో ఎస్.జొరాడు, డీఆర్పీలు దాలిబందు, ప్రేమ్‌సాహు, అప్పారావు, కిరణ్, ప్రధానోపాధ్యాయులు మామిడి దామోదరరావు, సీడీపీవో సీహెచ్ ఇందిర, సూపర్‌వైజర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.



కవిటి: అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న ఎంఈవో ధనంజయమజ్జి



నందిగాం: జ్ఞానజ్యోతి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



సోంపేట: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు దామోదరరావు

ఎన్నికల ప్రచారం



ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోరెడ్ల విజయగౌరీని గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిశోర్ కోరారు. సంతబొమ్మాళి మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం సందర్శించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటాలకు చట్టసభల్లో మద్దతుగా నిలిచే పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్న విజయగౌరీకి మద్దతు ఇవ్వాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నారాయణరావు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ గణపతిరావు, జిల్లా ఆకాడమిక్ సెల్ కో కన్వీనర్ బాడాన రాజు, జనవిజ్ఞాన వేదిక పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీ, యూటీఎఫ్ మండల అధ్యక్షులు పాపారావు, డి.రాము పాల్గొన్నారు.

– సంతబొమ్మాళి

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



కవిటి మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ బి.వెంకటేశ్వరరావు తల్లి కృష్ణవేణి ఇటీవల మృతి చెందారు. దీంతో అతని కుటుంబ సభ్యులను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం పరామర్శించారు. కృష్ణవేణి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్, రెడ్డిక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బర్ల నాగభూషణరావు ఉన్నారు.

-కవిటి

ఫ్యాన్లు వితరణ



ఇచ్ఛాపురం మండలం కొళిగాం ఉన్నత పాఠశాలకు పదో తరగతి చదవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు పది ఫ్యాన్లను మంగళవారం అందజేశారు. విద్యార్థులు పాండవ ఐశ్వర్య, లింగం చరణ్‌దొర, అభిషేక్‌దొర, ఆల్లనిరంజన్ దొర, మహాలక్ష్మిల తల్లిదండ్రులు వీటిని సమకూర్చారు. ప్రధానోపాధ్యాయులు నరేంద్రనాథ్ పట్నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

-ఇచ్ఛాపురం రూరల్

మెగా వైద్య శిబిరం



పలాస మండలం కిష్టిపురంలో మంగళవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్లో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి వైద్యులు 170 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. వైద్యులు పృథ్వీరాజు, ప్రదీప్, మాలిని, నాయకులు దువ్వాడ హర్షనాయుడు, బూర్లె కృష్ణంరాజు, తులసీరావు, ఢిల్లీరావు, బాబూరావు, నాగరాజు, జెమ్స్ కోర్డినేటరు చిన్నారావు ఉన్నారు.

-పలాస

వసతి గృహాలపై మరింత నిఘా


● జిల్లా బీసీ సంక్షేమాధికారి అనురాధ



సీసీ కెమెరాల ఏర్పాటును పర్యవేక్షిస్తున్న అధికారులు

టెక్కలి: వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల భద్రతపై మరింత నిఘా పెడతామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఇ.అనురాధ వెల్లడించారు. మంగళవారం టెక్కలిలోని వెనుకబడిన తరగతుల కళాశాల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వసతి గృహంలో మరమ్మతుల కోసం జిల్లా కలెక్టర్ రూ. 50 వేలు నిధులను మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో అవసరమైన మేరకు మరుగుదొడ్లు ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులను చేపడతామని తెలిపారు. అత్యవసరంగా ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరా పనులను ఆమె పర్యవేక్షించారు. వసతి గృహంలో విద్యార్థుల భద్రత, పర్యవేక్షణ విషయంలో ఎక్కడైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. ఇటీవల వసతి గృహంలో జరిగిన ఓ సంఘటనపై జిల్లా బీసీ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఇ.అనురాధ దృష్టికి తీసుకువెళ్లగా దీనిపై దర్యాప్తు చేపడతామని పేర్కొన్నారు. ఈమెతో పాటు ఏబీసీడబ్ల్యూఓ చాముండేశ్వర్రావు, వార్డెన్లు శ్రావణి, ఎస్.ఆనందరావు ఉన్నారు.

ఫిజియోథెరపీతో మేలు



చిన్నారులకు ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం టౌన్: దివ్యాంగ చిన్నారులకు రోజూ ఫిజియోథెరపీ చేయడం ద్వారా ఉపయోగముంటుందని ఫిజియోథెరపిస్టు బి.అమూల్య అన్నారు. ముత్యాలమ్మపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో మంగళవారం ఫిజియోథెరపీ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 13 మంది దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరఫీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు సూర్యం, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీనివాసులనాయుడును గెలిపించండి



ముత్యాలపేట ఉన్నత పాఠశాలలో ప్రచారం చేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కవిటి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులనాయుడుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 1938 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి ఉపాధ్యాయులను కోరారు. ఈ మేరకు వారు కవిటి మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏపీటీఎఫ్ మండల గౌరవాధ్యక్షులు కొత్తపల్లి రంగారావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు బల్ల ధర్మారావు, వంశీ, సీనియర్ సభ్యులు మొర్రి గోపి, శ్రీరామ్ మూర్తి బిసాయి పాల్గొన్నారు .

కొత్తపల్లి పాఠశాలను సందర్శించిన డీఈవో

టెక్కలి: కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనున డీఈవో ఎస్.తిరుమల చైతన్య మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కూర్కొని దిక్కులను, ఆయస్కాంతం గురించి వివరించి ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన జిల్లా కళా ఉత్సవంలో డ్యాన్స్, చిత్రలేఖనం పోటీలలో గెలిపొందిన విద్యార్థినులు పి.దివ్య, ఊర్వశిలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. డిప్యూటీ ఈఓ పి.విలియమ్స్, ప్రధానోపాధ్యాయులు గోవిందరావు, ఉపాధ్యాయులు షణ్ముఖరావు ఉన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

● జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



సమావేశంలో జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్, ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి: పీజీఆర్ఎస్‌కు గ్రామసభలు, రెవెన్యూ సదస్సులకు వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. మంగళవారం టెక్కలి ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలో రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. భూములకు సంబంధించి వర్గీకరణ, కొర్లెషన్ తదితర అర్జీల పరిష్కారంపై మండలాల వారీగా తెలుసుకున్నారు. మొత్తంగా ఒకే రోజు భూములకు సంబంధించిన 148 అర్జీలను పరిష్కరించారు. ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తితో పాటు డివిజన్ పరిధిలో తహసీల్దార్లు పాల్గొన్నారు.